సాఫ్ట్‌వేర్ కోర్సుల్లో శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

బర్కత్‌పుర, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): నేషనల్ స్కిల్ అకాడమి ఆధ్వర్యంలో ఏఐ డేటా సైన్స్, బిగ్ డేటా కోర్సులతో పాటు 100కి పైగా కంప్యూటర్ సాఫ్ట్‌వేర్ కోర్సుల్లో శిక్షణ కోసం రాష్ట్రవ్యాప్తంగా దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు అకాడమి ప్రోగ్రామ్ కో-ఆర్డినేటర్ సాయి శ్రీమాన్‌రెడ్డి తెలిపారు. ఇంటర్, ఇంజనీరింగ్, డిగ్రీ, పీజీ, పాలిటెక్నిక్ డిప్లొమా కోర్సుల విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని ఆయన తెలిపారు. దరఖాస్తుదారులు 100కి పైగా సాఫ్ట్‌వేర్ కోర్సుల నుంచి ఏదైనా ఎంపిక చేసుకోవచ్చని తెలిపారు. సైబర్ సెక్యూరిటీ, ఏఐ డేటా సైన్స్, బిగ్ డేటా, క్లౌడ్ కంప్యూటరింగ్, ఎథికల్ హ్యాకింగ్, పైథాన్, మెషిన్ లెర్నింగ్, బిజినెస్ అనలిటిక్స్ తదితర కోర్సులను ఎంపిక చేసుకోవచ్చని ఆయన తెలిపారు. ఇతర వివరాలకు 95058 00500లో సంప్రదించాలని ఆయన కోరారు.

సోలార్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ ఏర్పాటుపై ఉచిత శిక్షణ

ముషీరాబాద్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వ సంస్థ ద్వారా సోలార్ ఏర్పాటు, నైపుణ్య అభివృద్ధి అంశాలలో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు సంస్థ ప్రతినిధి సుదర్శన్ తెలిపారు. శుక్రవారం ముషీరాబాద్‌లోని కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... సోలార్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్‌పై ఉచిత శిక్షణ ఇవ్వడంతో పాటు ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నామని తెలిపారు. ఇతరులకు సోలార్ ఏర్పాటు చేసే విధంగా కేంద్ర ప్రభుత్వం నుంచి లైసెన్స్ సైతం మంజూరు చేయిస్తామని పేర్కొన్నారు. అలాగే సోలార్‌లో బిజినెస్ కమ్యూనికేషన్ స్కిల్స్‌లో కూడా నిపుణులచే ప్రత్యేక శిక్షణ ఇస్తామని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి అన్నారు. ఇతర వివరాలకు 94949 59108లో సంప్రదించాలని సుదర్శన్ కోరారు.



సమావేశంలో మాట్లాడుతున్న జస్టిస్ బి.చంద్రకుమార్

ప్రభుత్వ రంగ సంస్థలను కాపాడుకుందాం

రాంనగర్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): కార్మికుల శ్రమతో నిర్మించబడిన ప్రభుత్వ రంగ సంస్థలను కాపాడుకోవాల్సిన బాధ్యత కార్మికవర్గంపై ఉందని రిటైర్డ్ జస్టిస్ బి.చంద్రకుమార్ పిలుపునిచ్చారు. శుక్రవారం బాగ్‌లింగంపల్లిలోని ఓంకార్ భవన్‌లో జరిగిన టీయూసీఐ 5వ జాతీయ మహాసభలకు ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ.. భారతదేశ పురోభివృద్ధిలో ప్రభుత్వరంగ సంస్థల పాత్ర గణనీయంగా ఉందన్నారు. దేశ సామాజిక, రాజకీయ, ఆర్థిక ప్రగతిలో ప్రభుత్వ రంగ సంస్థల పాత్ర ఎనలేనిదన్నారు. బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రభుత్వరంగ సంస్థలను కారుచౌకగా కార్పొరేట్ కంపెనీలకు అప్పగిస్తున్నట్లు ఆరోపించారు. బీఎల్ఎఫ్ చైర్మన్ నల్లా సూర్యప్రకాష్‌రావు మాట్లాడుతూ రిజర్వేషన్లు కొనసాగాలంటే ప్రభుత్వరంగ సంస్థలను కాపాడుకోవాలని కార్మికులకు సూచించారు. అనంతరం ఏఐటీయూసీ కేంద్ర కమిటీ సభ్యులు తుడుం అనిల్‌కుమార్ మాట్లాడుతూ కార్మిక సంఘాలు ఐక్యంగా కార్మికుల హక్కులు, చట్టాలు రక్షించుకోవాలన్నారు. టీయూసీఐ కేంద్ర కమిటీ అధ్యక్షుడు కె.భాజత్, ప్రధాన కార్యదర్శి చార్లెస్ జార్జ్‌లు మాట్లాడుతూ దేశంలో కలిసి వచ్చే అన్ని కార్మిక సంఘాలతో పని చేస్తామన్నారు. కార్యక్రమంలో ఏపీ, తెలంగాణ, తమిళనాడు, కర్నాటక రాష్ట్రాల అధ్యక్షులు ప్రసాద్‌బాబు, రాజేష్‌కన్నా, కమరన్, బసవలింగప్ప పాల్గొన్నారు.

ఏబీఆర్ఎస్ఎం రాష్ట్ర కన్వీనర్‌గా యాదయ్య


ఏలూరి యాదయ్య

అంబర్‌పేట, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): అఖిల భారత రాష్ట్రీయ శైక్షిక్ మహాసంఘ్ (ఏబీఆర్ఎస్ఎం) తెలంగాణ రాష్ట్ర కన్వీనర్‌గా ఆచార్య ఏలూరి యాదయ్య నియమితులయ్యారు. ఈ మేరకు ఏబీఆర్ఎస్ఎం జాతీయ ప్రధాన కార్యదర్శి ప్రొఫెసర్ గీతాభట్, సహాయ కార్యదర్శి గుంత లక్ష్మణ్‌లు శుక్రవారం ఆచార్య యాదయ్యకు నియామక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా యాదయ్య మాట్లాడుతూ అధ్యాపకులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించడానికి కృషి చేస్తానన్నారు. యాదయ్యను రాష్ట్ర కన్వీనర్‌గా నియమించడం పట్ల తెలంగాణ గెజిటెడ్ ఉపాధ్యాయుల సంఘం అధ్యక్షుడు కె.భాస్కర్, నాయకులు చేగోని రవికుమార్, విప్లవ శంకర్, శుక్ల శంకర్, శ్రీదేవి హర్షం వ్యక్తం చేశారు.


రాణికి నియామక పత్రం అందజేస్తున్న అంబటి కృష్ణమూర్తి

ఐఎన్‌టీయూసీ మహిళా విభాగం జాతీయ ప్రధాన కార్యదర్శిగా రాణి నియామకం

బర్కత్‌పుర, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): ఐఎన్‌టీయూసీ మహిళా విభాగం జాతీయ ప్రధాన కార్యదర్శిగా కాకర్ల డి.రాణి నియమితులయ్యారు. శుక్రవారం నారాయణగూడలోని ఐఎన్‌టీయూసీ కార్యాలయంలో జాతీయ అధ్యక్షుడు అంబటి కృష్ణమూర్తి ఆమెకు నియామకపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. మోదీ ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను ప్రతిఘటించడానికి పలు కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. కార్మికుల ఉద్యమంలో మహిళా నాయకురాళ్లను భాగస్వామ్యం చేయడానికి కార్యవర్గంలో స్థానం కల్పిస్తున్నామన్నారు. డి.రాణి మాట్లాడుతూ ఐఎన్‌టీయూసీని బలోపేతం చేయడానికి కృషి చేస్తానన్నారు. రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు గుంజా శ్రీనివాస్, గూడ ఐలయ్య, రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు జ్యోతి, నాయకులు రాధక్క, సుల్తానా పాల్గొన్నారు.


అయ్యప్ప మహాపడిపూజలో ఎమ్మెల్యే గోపాల్, నందికంటి గోపాల్‌రావు

ఘనంగా అయ్యప్ప మహాపడిపూజ

ముషీరాబాద్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): ముషీరాబాద్‌లోని పోల్‌బాల్ ఆంజనేయస్వామి ఆలయంలో కోడూరు రాజు ఆధ్వర్యంలో అయ్యప్పస్వామి మహాపడిపూజ శుక్రవారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే ముఠా గోపాల్, బీఆర్ఎస్ యువ నాయకు ముఠా జైసింహ అయ్యప్పస్వామి పూజలో పాల్గొన్నారు. అనంతరం అన్నదానం చేశారు. కార్యక్రమంలో ముషీరాబాద్ బీఆర్ఎస్ నాయకులు నందికంటి గోపాల్‌రావు, డి.శివముదిరాజ్, శ్రీధర్‌చారి, దేవరాజ్, రాజ్‌కుమార్, జే.ఎస్ పటేల్, సత్యనారాయణ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఆరే మహేందర్ తదితరులు

మంత్రివర్గ విస్తరణలో బీసీలకు చోటు కల్పించాలి

రాంనగర్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): త్వరలో రాష్ట్రంలో జరిగే మంత్రివర్గ విస్తరణలో బీసీలకు చోటు కల్పించాలని తెలంగాణ బీసీ ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు ఆరే మహేందర్ డిమాండ్ చేశారు. చిక్కడపల్లిలోని ఐక్యవేదిక కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మంత్రివర్గ విస్తరణలో సామాజిక న్యాయం పాటించాలన్నారు. అన్ని వర్గాలకు వారి జనాభా ప్రకారం మంత్రివర్గంలో సముచిత స్థానం కల్పించాలన్నారు. ప్రభుత్వం నియమించబోయే నామినేటెడ్ పదవులలో బీసీలకు 50 శాతం చోటు కల్పించాలన్నారు. కార్యక్రమంలో బీసీ ఐక్యవేదిక కో-ఆర్డినేటర్ దశరథం, నగర అధ్యక్ష, కార్యదర్శులు రాజేష్, క్రాంతి, నాయకులు రవి, నిఖిల్, అభిషేక్ పాల్గొన్నారు.

అధ్వానంగా రోడ్లు

- నాలా నిర్మాణం పూర్తైనా చేపట్టని రోడ్ల పనులు
- ప్రమాదాలకు గురవుతున్న వాహనదారులు

నల్లకుంట, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): నల్లకుంట డివిజన్‌లోని శంకరమఠం కూరగాయల మార్కెట్ నుంచి బాగ్‌లింగంపల్లి బ్రిడ్జి వరకు స్ట్రాటజిక్ నాలా డెవలప్‌మెంట్ ప్లాన్ నాలా (ఎస్ఎన్‌డీపీ) పనుల కోసం రెండేళ్ల పాటు రోడ్లను తవ్వారు. కానీ పనులు పూర్తయిన తర్వాత రోడ్లకు ప్యాచ్‌వర్క్ పనులు చేపట్టలేదు. దీంతో రోడ్లు గుంతలుగా మారి అస్తవ్యస్తంగా తయారయ్యాయి. ఈ రోడ్లపై ప్రజలు ప్రయాణం చేయలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కొన్నిమార్లు ప్రమాదాలకు గురవుతున్నారు. జీహెచ్ఎంసీ, ఇంజనీరింగ్, ఇరిగేషన్ అధికారుల మధ్య సమన్వయలోపంతో నల్లకుంటలో రహదారులకు మోక్షం కలగడం లేదు. దీంతో శంకరమఠం కూరగాయల మార్కెట్ నుంచి చిక్కడపల్లి, బాగ్‌లింగంపల్లి, సుందరయ్యవిజ్ఞాన కేంద్రం, నారాయణగూడ వైపు వెళ్లే వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. నల్లకుంట పాత రామాలయం వెళ్లే దారిలో రోడ్డుకు ఓ వైపు మాత్రమే నూతన సీసీ రోడ్డు నిర్మించిన అధికారులు మరో వైపు అలాగే వదిలేసి చేతులు దులుపుకున్నారు. అదే విధంగా ఈ రోడ్డు నుంచి బాగ్‌లింగంపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రానికి వెళ్లే దారి గోతులమయంగా మారింది. బాక్స్ నాలా పనులు పూర్తయి రెండేళ్లు అవుతున్నా రోడ్డు పనులు మాత్రం పూర్తి చేయడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు.


ఫీవర్ ఆస్పత్రి వెనుక గేట్ వైపు నాలా పనులు పూర్తయిన మరమ్మతులకు నోచుకోని రోడ్డు


బాగ్‌లింగంపల్లిలోని ఎస్‌వీకేకు వెళ్లే అసంపూర్తి రోడ్డు


నల్లకుంట పాత రామాలయం వైపు వెళ్లే రోడ్డు దుస్థితి

అసంపూర్తి రోడ్డు పనులు పూర్తి చేయాలి



నాలా నిర్మాణంతో గోతులమయమైన రోడ్డు వల్ల ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు. ఈ విషయంపై ఎస్ఎన్‌డీపీ, జీహెచ్ఎంసీ, ఇంజనీరింగ్, ఇరిగేషన్ అధికారులు, ఎమ్మెల్యేతో కలిసి సమస్య సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకుంటాం. తద్వారా నల్లకుంటలో అసంపూర్తిగా ఉన్న రోడ్డు పనులు పూర్తి చేయించి ప్రజల ఇక్కట్లను తొలగిస్తాం.

\- యాకర అమృత, నల్లకుంట కార్పొరేటర్

రోడ్ల మరమ్మతులకు నిధులు కేటాయించాలి

ముషీరాబాద్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): ముషీరాబాద్ డివిజన్‌లో డ్రైనేజీ, మంచినీటి పైప్‌లైన్ నిర్మాణ పనుల కోసం తవ్వకాలు చేసిన రోడ్లను మరమ్మతులు చేయకపోవడంతో అవి అధ్వానంగా మారాయి. అస్తవ్యస్త రోడ్ల కారణంగా ప్రజలు ప్రమాదాలకు లోనవుతున్నారని ముషీరాబాద్ కార్పొరేటర్ సుప్రియా నవీన్‌గౌడ్ అన్నారు. రోడ్ల మరమ్మతులకు నిధులు మంజూరు చేయాలని జీహెచ్ఎంసీ కమిషనర్ ఇలంబరితిని శుక్రవారం కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం కార్పొరేటర్ మాట్లాడుతూ.. కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి పలుమార్లు అధికారులకు లేఖలు రాసారని అయినా రోడ్డు పనులు చేపట్టడం లేదని ఆరోపించారు. గంగపుత్ర కాలనీ, భరత్‌నగర్, బాపూజీనగర్, ఏక్‌మినార్ ప్రాంతాలలో అస్తవ్యస్తంగా ఉన్న రోడ్ల మరమ్మతులకు నిధులు మంజూరు చేయాలన్నారు. గతంలో సైతం ఈ ప్రాంతాలలో రోడ్ల మరమ్మతులకు నిధులు మంజూరైనా పనులు చేపట్టకపోవడంతో నిధులు వెనక్కి వెళ్లాయని ఆమె ఆరోపించారు. ఇప్పటికైనా జీహెచ్ఎంసీ ఉన్నతాధికారులు స్పందించి ప్రజలు ఎదుర్కొంటున్న రోడ్ల సమస్యలను గుర్తించి వెంటనే మరమ్మతులు చేయించాలని, ప్రజలను ప్రమాదాలకు గురి కాకుండా చూడాలన్నారు.

ప్రణాళికబద్ధంగా అంబర్‌పేట అభివృద్ధి: ఎమ్మెల్యే


రోడ్డు పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వెంకటేష్, కార్పొరేటర్

అంబర్‌పేట, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): ప్రణాళికబద్ధంగా అంబర్‌పేట నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తున్నట్లు ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ తెలిపారు. అంబర్‌పేట డివిజన్ ఎంసీహెచ్ కాలనీలో రూ.17 లక్షల వ్యయంతో చేపట్టిన సీసీ రోడ్డు నిర్మాణ పనులను కార్పొరేటర్ విజయ్‌కుమార్‌గౌడ్‌తో కలిసి ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ శుక్రవారం ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. అంబర్‌పేట నియోజకవర్గంలోని అన్ని డివిజన్లలో అభివృద్ధి పనులు చేపట్టినట్లు తెలిపారు. కార్పొరేటర్ విజయ్‌కుమార్ గౌడ్ మాట్లాడుతూ ప్రజలకు ఇబ్బందులు కలగకుండా అభివృద్ధి పనులు పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో జీహెచ్ఎంసీ అధికారులు పాల్గొన్నారు.

బాగ్‌అంబర్‌పేటలో పాదయాత్ర

నల్లకుంట: బాగ్‌అంబర్‌పేట డివిజన్‌లోని శాంతినగర్, చెంచుబస్తీ, ది హోప్ చర్చి వీధిలో ఎమ్మెల్యే వెంకటేష్, కార్పొరేటర్ బి.పద్మావెంకటరెడ్డితో కలిసి శుక్రవారం పాదయాత్ర చేశారు. ఈ సందర్భంగా ప్రజలెదుర్కొంటున్న సమస్యలను ఎమ్మెల్యే అడిగి తెలుసుకున్నారు.

రైతుబంధును తక్షణమే విడుదల చేయాలి


మాట్లాడుతున్న రచ్చ సుభద్రారెడ్డి

బర్కత్‌పుర, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు రైతు బంధును తక్షణమే విడుదల చేయాలని సోషలిస్ట్ పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు రచ్చ సుభద్రారెడ్డి డిమాండ్ చేశారు. రైతుబంధు సాయం పెంచుతామని హామీ ఇచ్చారని, ఈ మేరకు హామీని నిలబెట్టుకోవాలని కోరారు. శుక్రవారం బర్కత్‌పురలోని పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. రంగారెడ్డి జిల్లా షాబాద్ మండలంలో ప్రైవేట్ ఫ్యాక్టరీల కోసం రైతుల వద్ద భూమి తీసుకుని ఇంత వరకు పూర్తి స్థాయిలో పరిహారం చెల్లించలేదని ఆరోపించారు. రైతులకు వెంటనే పరిహారం చెల్లించాలని ఆమె డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు రమేష్‌నాయుడు, ఆంజనేయులు, సునీతరాణి, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న దుండ్రా కుమారస్వామి

జనగణనలో కులగణన చేపట్టాలి

జాతీయ బీసీ దళ్ అధ్యక్షుడు దుండ్రా కుమారస్వామి

బర్కత్‌పుర, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): మోదీ ప్రభుత్వం జాతీయ స్థాయిలో జనగణనలో కులగణన చేపట్టాలని జాతీయ బీసీ దళ్ అధ్యక్షుడు దుండ్రా కుమారస్వామి డిమాండ్ చేశారు. శుక్రవారం కాచిగూడలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ బీసీలను కేంద్ర ప్రభుత్వం అన్ని రంగాల్లోనూ నిర్లక్ష్యం చేస్తోందని ఆరోపించారు. కులగణనతోనే బీసీలకు న్యాయం జరుగుతుందన్నారు. కేంద్ర ప్రభుత్వం మాత్రం బీసీలకు అన్యాయం చేస్తూ కాలయాపన చేస్తోందని విమర్శించారు. గతంలో బీజేపీ జాతీయ స్థాయిలో కులగణన చేపట్టాలని 2010లో డిమాండ్ చేసిందని ఇప్పుడు అధికారంలోకి వచ్చిన తర్వాత దానిని విస్మరించిందని ధ్వజమెత్తారు. వివిధ రాష్ట్రాలలో నియమించిన బీసీ కమిషన్లు కులగణన చేయాలని సిఫార్సు చేశాయని, అయినప్పటికీ కేంద్ర ప్రభుత్వం స్పందించడం లేదని విమర్శించారు. ఈ సమావేశంలో జాతీయ బీసీ దళ్ గ్రేటర్ అధ్యక్షుడు రాజేష్‌యాదవ్, సలహాదారులు వెంకటరమణ పాల్గొన్నారు.

15న చిమ్మపూడి ఫౌండేషన్ పంచమ వార్షికోత్సవం

చిక్కడపల్లి, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): చిమ్మపూడి ఫౌండేషన్ పంచమ వార్షికోత్సవం ఈనెల 15న సాయంత్రం త్యాగరాయగానసభలో జరుగుతుందని ఆ సంస్థ నిర్వాహకులు చిమ్మపూడి శ్రీరామమూర్తి తెలిపారు. ప్రభుత్వ పూర్వ సలహాదారు డా. కేవీ రమణాచారి, రచయిత్రి ముక్తేవి భారతి, ఆధ్యాత్మిక ప్రవచనకర్త మల్లాది శ్రీమన్నారాయణమూర్తి తదితరులు అతిథులుగా హాజరవుతారని తెలిపారు.

క్రిస్మస్ వేడుకల కమిటీలో సాల్మన్‌రాజు నియామకం

రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించే క్రిస్మస్ వేడుకల సందర్భంగా ఉత్సవాల నిర్వహణకు ఏర్పాటు చేసిన కమిటీలో గాంధీనగర్ డివిజన్‌కు చెందిన సీనియర్ కాంగ్రెస్ నాయకుడు గోనె సాల్మన్‌రాజు నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉత్సవాల నిర్వహణ విషయంలో అన్ని జాగ్రత్తలు పాటిస్తూ ప్రభుత్వానికి మంచి పేరు తెస్తామని వివరించారు. తనను నియమించిన సీఎం రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

నేడు నల్లకుంటలో శ్రీదత్తజయంతి

నల్లకుంట: ఫ్రెండ్స్ కల్చరల్ అసోసియేషన్, శ్రీసాయిదత్త పీఠం సంయుక్త ఆధ్వర్యంలో శ్రీదత్తజయంతి మహోత్సవం గత 15 సంవత్సరాలుగా వైభవంగా నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు సీ.హెచ్.మోహన్ తెలిపారు. నల్లకుంట డివిజన్‌లోని బ్రాహ్మణ హాస్టల్ వీధిలో శ్రీదత్తజయంతి మహోత్సవం ఈనెల 14వ తేదీ ఉదయం 9.30 గంటలకు పూజా కార్యక్రమం, మధ్యాహ్నం 12 గంటలకు అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. శ్రీదత్త జయంతి మహోత్సవ పూజా కార్యక్రమంలో భక్తులు హాజరుకావాలని ఆయన కోరారు.



ఒక వెలుగు రేఖ పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ప్రొఫెసర్ శాంతాసిన్హా, కొండవీటి సత్యవతి, డాక్టర్ మమత రఘువీర్ ఆచంట తదితరులు

'ఒక వెలుగురేఖ' పుస్తకావిష్కరణ

రాంనగర్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): ఆడపిల్లలకు ప్రత్యేకం 'ఒక వెలుగురేఖ' పుస్తకావిష్కరణ కార్యక్రమం శుక్రవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా హాజరైన ప్రొఫెసర్ శాంతాసిన్హా, కొండవీటి సత్యవతి, డాక్టర్ మమత రఘువీర్ ఆచంట, కె.సుభద్ర, సంధ్య, మహజబీన్, కె.హిమబిందు, బండారు విజయ, కృపాకర్, కె.జె.రామారావు తదితరులు పుస్తకాన్ని ఆవిష్కరించి మాట్లాడారు. ఈ సమాజంలో, చట్టాలలో ఆడపిల్లలకు రక్షణ లేదన్నారు. బేటీ లడావో దునియా బచావో, ఆడ పిల్ల పుడితే లక్ష్మీదేవి అని మురిసిపోయే వాళ్లతో మనకు ఎలాంటి పేచిలేదని కానీ అమ్మాయికి ఇది తగదు, అది తగదు అంటూ అడుగడుగుకు సవాలక్ష లక్ష్మణరేఖలు గీసే సనాతన ధర్మాలతో ఆడపిల్ల పుట్టడం, పెరగడం చివరికి చావును కూడా ప్రశాంతంగా ఉండడం లేదన్నారు. జీవితం అంటే ఎంత చీకటో ఒక ఆడ పిల్లకు మాత్రమే తెలుసు అని అందుకే ఒక వెలుగు రేఖ పుస్తకం ఆడపిల్లలకు ప్రత్యేకం అన్నారు. ఈ పుస్తకాన్ని ప్రతి ఒక్కరు చదవాలని సూచించారు.

ఆలయ పునర్నిర్మాణ కమిటీ సభ్యుల ప్రమాణం

చిక్కడపల్లి, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): చిక్కడపల్లి వివేక్‌నగర్ ఆంజనేయస్వామి ఆలయం పునర్నిర్మాణ కమిటీ సభ్యులు ప్రమాణ స్వీకారం శుక్రవారం చేశారు. ఆలయం ఆవరణలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో నూతన కమిటీ సభ్యులతో దేవాదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ సురేఖ నియామకపత్రాలు అందజేసి ప్రమాణస్వీకారం చేయించారు. ఈ సందర్భంగా ఆలయ పునర్నిర్మాణ కమిటీ చైర్మన్‌గా జానకిసుధాకర్‌ను ఎన్నుకున్నారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న మాజీ ఎంపీ, టీపీసీసీ ఎం. అంజన్‌కుమార్‌యాదవ్ చేతులమీదుగా భక్తుడు, ప్రముఖ వ్యాపారి వెంకటగోవిందరావు ఆలయ అభివృద్ధి కోసం లక్షా వెయ్యి నూట పదహారు రూపాయల విలువ చేసే చెక్కును ఆలయ ఈవో మాచర్ల దేవనాథానికి అందజేశారు. అనంతరం అంజన్‌కుమార్‌యాదవ్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ఆలయాల అభివృద్ధికి కట్టుబడి ఉందన్నారు. ఈ సందర్భంగా ఆలయ పునర్నిర్మాణ కమిటీ సభ్యులు జానకి సుధాకర్, జి. పద్మావతి, నిర్మల, ముక్కా రామకృష్ణ, శ్యామ్‌కుమార్, సరళానీతారామణి, లక్ష్మీనారాయణ, కంది సుబ్బారావు, అముర బాలకుమార్, నవీన్‌ప్రసాద్, వెంకట శిశుకుమార్, వెంకట ప్రతాప్‌కుమార్, లోక్‌నాథ్, వెంకట్‌రావు, మురికి గణేశ్, రామకోటేశ్వర్, ఓరుగంటి మోహన్‌రావులు ప్రమాణస్వీకారం చేశారు. కార్యక్రమంలో గోవింద్, విడికృష్ణ, శీలం సత్యనారాయణ, శంకర్ పాల్గొన్నారు.

ఫిలిం సెన్సార్ బోర్డు సభ్యురాలిగా కోయల్కర్ జ్యోతి నియామకం


జ్యోతి

రాంనగర్: ఫిలిం సెన్సార్ బోర్డు సభ్యురాలిగా బీజేపీ రాంనగర్ డివిజన్ మహిళా మోర్చా ఉపాధ్యక్షురాలిగా కోయల్కర్ జ్యోతి నియమితులయ్యారు. ఆమె నియామకాన్ని ఫిలిం సెన్సార్ బోర్డు హైదరాబాద్ రీజినల్ ఆఫీసర్ షీఫాలికుమార్ శుక్రవారం ప్రకటించి నియామకపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బాగ్‌లింగంపల్లిలో ఆమె విలేకరులతో మాట్లాడుతూ తనకు ఈ పదవి వచ్చేందుకు కృషి చేసిన రాజ్యసభ సభ్యులు డాక్టర్ కె.లక్ష్మణ్, కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి తదితరులకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు.

ఎక్సైజ్ శాఖను బీసీలకు కేటాయించాలి

బీసీ సంఘాల నేతల డిమాండ్

కవాడిగూడ, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఎక్సైజ్ శాఖను బీసీ సామాజిక వర్గానికి చెందిన వారికి కేటాయించాలని ఐదు బీసీ సంఘాల నేతలు సీఎం రేవంత్‌రెడ్డిని డిమాండ్ చేశారు. శుక్రవారం దోమలగూడలోని బీసీ భవన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో బీసీ సంక్షేమ సంఘం తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కుల్కచర్ల శ్రీనివాస్ ముదిరాజ్, బీసీ విద్యార్థి సంఘం జాతీయ అధ్యక్షుడు తాటికొండ విక్రమ్‌గౌడ్, బీసీయువజన సంఘం జాతీయ అధ్యక్షుడు కనకాల శ్యామ్‌కురుమ, బీసీ జనసైన్యం అధ్యక్షుడు సింగం నాగేష్‌గౌడ్, బీసీ సంక్షేమ సంఘం గ్రేటర్ అధ్యక్షుడు మాదేశి రాజేష్ గంగపుత్రలు మాట్లాడుతూ.. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఎక్సైజ్ శాఖను బీసీ సామాజిక వర్గానికి చెందిన పద్మారావుగౌడ్, శ్రీనివాస్‌గౌడ్‌లకు కేటాయించారని, అదే పద్ధతిలో కాంగ్రెస్ ప్రభుత్వం కూడా బీసీలకు ఎక్సైజ్ శాఖను అప్పగించాలని కోరారు. ఎక్సైజ్ శాఖను నిర్వహించడంలో మంత్రి జూపల్లి కృష్ణారావు పూర్తిగా విఫలం చెందారని ఆరోపించారు. మంత్రి చర్యల వల్ల కల్లుగీత వృత్తి దెబ్బతింటోందని వాపోయారు. ఇప్పటికైనా కల్లుగీత వృత్తి, దానిపై ఆధారపడి జీవించే కార్మికులను దృష్టిలో పెట్టుకొని కల్లు దుకాణాలపై జరిగే దాడులను అరికట్టాలని వెంటనే ఎక్సైజ్ శాఖను బీసీలకు అప్పగించి న్యాయం చేయాలని వారు సీఎం రేవంత్‌రెడ్డిని కోరారు. ఈ సమావేశంలో బీసీ సంఘాల నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ప్రీమియర్ షోలకు అనుమతులు ఇవ్వొద్దు

- చిన్న సినిమాలకు ప్రోత్సాహకాలు ఇవ్వండి
- బీసీ పొలిటికల్ జేఏసీ చైర్మన్ యుగంధర్‌గౌడ్

నల్లకుంట, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): పెద్ద హీరోల ప్రీమియర్ షోలకు అనుమతులు ఇచ్చి టికెట్ల రేట్లు ఇష్టానుసారంగా పెంచుకునే వెసులుబాటు కల్పించడంతో అమాయక ప్రజల ప్రాణాలు పోతున్నాయని బీసీ పొలిటికల్ జేఏసీ చైర్మన్ రాచాల యుగంధర్‌గౌడ్ ఆవేదన వ్యక్తం చేశారు. పుష్ప సినిమా హీరో అల్లు అర్జున్‌ను అరెస్ట్ చేయడం అభినందనీయమని ఆయన తెలిపారు. శుక్రవారం సాయంత్రం హైదర్‌గూడలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ పెద్ద సినిమాలను ప్రోత్సహించడం కాకుండా చిన్న సినిమాలకు ప్రోత్సాహకాలు అందిస్తే సినీ పరిశ్రమ నిలదొక్కుకుంటుందన్నారు. తన సినిమా చూడడానికి వచ్చిన ఒక మహిళ తొక్కిసలాటలో చనిపోతే.. ఆ ఘటన జరిగిన రోజు స్పందించకుండా కనీసం వారిని పరామర్శించని అల్లు అర్జున్‌ను బాధితులు ఇచ్చిన ఫిర్యాదుపై విచారణ జరిపి నేడు అరెస్ట్ చేస్తే పరిశ్రమ పెద్దలు ఏదో జరిగిపోయిందని పేర్కొనడం తగదన్నారు. రీల్ హీరోను అరెస్ట్ చేసిన రియల్ పోలీసులకు ఆయన అభినందనలు తెలిపారు. ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరుపై తెలంగాణ సమాజం హర్షిస్తుందని, ఒక సెలబ్రిటీని అరెస్ట్ చేయడం చట్టంపై ప్రజలకు నమ్మకం కలిగిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు గాలిగల్ల సాయిబాబా, శివశంకర్‌గౌడ్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

రైతులకు బేడీలు వేస్తారా?

ఏఐకేఎంఎస్ నేతల డిమాండ్


మాట్లాడుతున్న భిక్షపతి, ఐలయ్య

రాంనగర్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): లగచర్ల ఘటన కేసులో రిమాండ్ ఖైదీగా జైలులో ఉన్న హీర్యానాయక్‌ను పోలీసులు బేడీలు వేసి వైద్యానికి తీసుకెళ్లడం దుర్మార్గపు చర్య అని అఖిల భారత రైతు కూలీ సంఘం (ఏఐకేఎంఎస్) రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు మామిడాల భిక్షపతి, గౌని ఐలయ్యలు అన్నారు. శుక్రవారం విద్యానగర్‌లోని కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. లగచర్లతో సహా అయిదు గ్రామాలకు చెందిన 1,300 ఎకరాల భూములను ఫార్మా కంపెనీల కోసం తీసుకోవడానికి ప్రయత్నించిన సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ప్రజా ఉద్యమానికి తలొగ్గి దానిని వెనక్కి తీసుకుంటున్నట్లుగా ప్రకటించిందన్నారు. అదే సందర్భంలో అధికారులపై దాడి చేశారనే కేసుని మాత్రం ఉపసంహరించుకోకుండా వంద మందికిపైగా రైతులను జైలులో నిర్బంధించిందని వారు ఆరోపించారు. రైతులపై పెట్టిన కేసులను కూడా ఉపసంహరించుకోవాలని వారు డిమాండ్ చేశారు. జైలులో అనారోగ్యంతో హీర్యానాయక్ గిరిజన ఖైదీకి బేడీలు వేసి వైద్యానికి తీసుకెళ్లడం ప్రభుత్వ పనితీరుకు నిదర్శనంగా ఉందన్నారు. ప్రజాపాలన పేరుతో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి యేడాది పూర్తయిన పోలీసు వ్యవస్థ పనితీరులో ఎలాంటి మార్పు రాలేదన్నారు. లగచర్ల ఘటనలో రైతులపై పెట్టిన కేసును ఉపసంహరించుకోవాలని, లగచర్ల కేసులో జైలులో ఉన్న వారందరినీ విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

కల్లుగీత జోలికొస్తే ఖబడ్దార్

రాంనగర్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా కల్లుగీత వృత్తి, కల్లు దుకాణాలపై ఎక్సైజ్, నార్కోటిక్ అధికారులు, పోలీసులు దాడులు చేస్తున్నారని, ఈ చర్యను తక్షణమే ఆపకపోతే పెద్దఎత్తున ఉద్యమం తప్పదని, కల్లు గీత జోలికొస్తే ఖబడ్దారని గౌడ కల్లుగీత వృత్తిదారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వెంకన్నగౌడ్ హెచ్చరించారు. శుక్రవారం చిక్కడపల్లిలోని సంఘం కార్యాలయంలో ఆయన మాట్లాడారు. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు గౌడ్‌లపై విచక్షణారహితంగా దాడులు చేసి తెలంగాణలో వేలాది కల్లుగీత సొసైటీలను రద్దు చేసిన చరిత్ర కాంగ్రెస్ ప్రభుత్వానిదని, తిరిగి అప్పటి రోజులను గుర్తు చేస్తున్నారని ఆయన అన్నారు.

ఎస్సీ వర్గీకరణను అమలు చేయాలి

కవాడిగూడ: ఎస్సీ ఏబీసీడీ వర్గీకరణ చేసే అధికారం రాష్ట్ర ప్రభుత్వాలకు అనుమితినిస్తూ సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు ఆధారంగా ఎంఆర్‌పీఎస్, ఎంఎస్ఎఫ్, ఎంపీఎఫ్, ఎంఎంఎస్, ఎంవైఎస్ సంఘాలు స్వాగతిస్తు ఆ నిర్ణయాన్ని వెంటనే రాష్ట్రంలో అమలు చేయాలని శుక్రవారం లోయర్ ట్యాంక్‌బండ్‌లోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించి అనంతరం ఎస్సీ వర్గీకరణ చైర్మన్ డాక్టర్ అక్తర్ షమీమ్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జాతీయ మాదిగ రాజకీయ పోరాట సమితి జాతీయ అధ్యక్షుడు రమేష్‌కుమార్, నేతలు మాట్లాడారు. మాదిగ, మాదిగ ఉపకులాల రిజర్వేషన్ల వర్గీకరణ చేయాలని కోరారు.

'రైతు హీర్యా నాయక్‌కు ఏం జరిగినా ప్రభుత్వమే బాధ్యత వహించాలి'

రాంనగర్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): లగచర్లకు చెందిన రైతు హీర్యా నాయక్‌కు ఏం జరిగినా ప్రభుత్వమే బాధ్యత వహించాలని సేవాలాల్ సేన వ్యవస్థాపక అధ్యక్షుడు భూక్య సంజీవనాయక్ హెచ్చరించారు. రైతులను పోలీసులు సంకెళ్ల వేసి అరెస్ట్ చేయడాన్ని నిరసిస్తూ సేవాలాల్ సేన ఆధ్వర్యంలో శుక్రవారం బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య పార్కు వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లంబాడీ రైతుల పట్ల సీఎం కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. భూములు ఇవ్వనందుకు హీర్యానాయక్‌ను పోలీసులు అరెస్ట్ చేశారని, అతడికి ఏం జరిగినా ప్రభుత్వమే బాధ్యత వహించాలన్నారు.